


# మాచో వ్యక్తి

సుస్మితా రమణమూర్తి

రాజమూర్తి గదిలో పచార్లు చేస్తున్నాడు. అంతులేని ఆనందంతో గంతులు వేస్తుందతని మనస్సు.

గదిలో నిశ్శబ్దం.

అతని అంతరంగంలో పొంతన కుదరని భావాల గజిబిజి, టేబుల్ మీద క్రొత్త మనీపర్స్.

పేపర్ వెయిట్ క్రింద గాలికి రెపరెపలాడుతున్న కొన్ని క్రొత్త పది రూపాయల నోట్లు, ఎనిమిది పదులు— అంటే ఎనభై రూపాయలు. మనీపర్స్‌లో వున్న దాంతో కలిసి వెరసి నూట ఇరవై. అలా ఒకసారికాదు. రెండుసార్లు కాదు. అది నూట పదకొండోసారి రాజమూర్తి ఆనందంతో ఉక్కిరి బిక్కిరైన వైనం. బి. సీ. నాటి అతని చేతివాచీ 'అయిదూ నలభై' అంటోంది.

కాదన్నట్లు ప్రక్కింటి ప్లీడరుగారి గోడగడియారం ఆరుసార్లు తన గుండెను బాదుకుంది.

గబగబా గదిలోంచి రోడ్ మీదకి వచ్చిపడ్డాడు రాజమూర్తి. రోడ్డుమీద పడ్డ మేఁవిటని ఆశ్చర్యపోకండి. అతనిలోని ఆలోచన్లు అతణ్ణి రోడ్డుమీద పడేసి ముందుకు నడిపిస్తున్నయ్.

మెయిన్ రోడ్!

మహా పట్నంగా వెలిగిపోతోన్న

విశాఖపట్నంలోని ఒకే ఒక్క ఇరుకు సందుల్లాంటి మెయిన్ రోడ్!! రోడ్డు కిరువైపులా వున్న జీవంగల భవనాలు రోజురోజుకి ముందుకి వచ్చేస్తుంటే— పాపం! ఆ మెయిన్ రోడ్ గతి ఇరుకు సందు వైనంగాక మరేమౌతుది?— అని మీరంటే నేనుకూడా ఎంచక్కా మీ పక్షంలో చేరిపోతాను.

వచ్చే పోయే బస్సులు—

ఇటు పాదచారులు—

అటు వాహనాల రణగొణ ధ్వనులు—

అమ్మాయిల్ని చూస్తూ ఆనందిస్తున్న రోమియోలు—

ఫుట్ పాత్ లమీద మద్రాస్ మూర్ మార్కెట్ లోలా రకరకాల దుకాణాలు వివిధ వింత జీవనోపాధులు!!!

ఆ రోజే తెరవబడ్డ ఓ హోటల్ మొదటిరోజు రిలీజైన 'డిష్యుం! డిష్యుం!!' తెలుగు సినిమాలా జనంతో కిటకిటలాడి పోతోంది.

రోడ్డుమీద నడుస్తున్న రాజమూర్తి అప్రయత్నంగా ఆ హోటల్ ముందు ఆగిపోయాడు— 'హోటల్ కెళ్ళి కాస్త టిఫిన్ జేస్తే?' అనుకున్నాడు.

'గురూ! ధరలు మండిపోతున్నాయ్! నీకు ప్రియమైన మసాలదోశ అరవై పైసలైపోయింది. ఆపైన 'బ్రూ' మరో యాభై పైసలు. ఎలాగూ ఓ గంటలో భోజనం చేస్తావుగా? ఎందుకు పోనిద్దూ, అనవసరపు ఖర్చు!' రాజమూర్తిలోని రాజమూర్తి ఓ ఉచిత సలహా పారేశాడు.

అంతే ఆ హోటల్ వేపు మరి చూడకుండా ముందుకి నడిచాడు రాజమూర్తి.

తనవేపే వస్తున్న తన రూమ్మేట్ రాజుని చూసీ చూడనట్లుగా ప్రక్కనున్న బట్టల దుకాణం తాలూకు 'షో కేస్' వేపు చూస్తూండిపోయాడు రాజమూర్తి.

రాజు సరాసరి రాజమూర్తి దగ్గర కొచ్చి— "ఒరే, మూర్తీ! రేపేరా పరీక్ష ఫీజు కట్టడానికి ఆఖర్రోజు, ప్రతినెలా వచ్చినట్లు ఈ నెలకూడా ఇంటిదగ్గర్నుంచి డబ్బొచ్చింది కాని ఎవరో నా డబ్బుని కొట్టేశార్రా! ఎలాగైనా పరీక్ష ఫీజుకి ఓ నలభై సర్దరా, వచ్చేనెల్లో ఇచ్చేస్తాను" ఆత్రంగా అడిగాడు.

రాజమూర్తి ఇబ్బందిగా ముఖంపెట్టి "రాజూ! నీ వింతగా బ్రతిమాలాలా నన్ను? ఉంటే ఈపాటికి ఇచ్చేవాణ్ణి కాదట్రా? అయినా నా సంగతి నీకు తెలియదా, ఏంవిటి? నీ బాధని ఆ మాత్రం గుర్తించలేనూ? అందులోనూ పరీక్ష ఫీజుకోసం అడుగుతున్నావ్..." అన్నాడు.

"సర్లేరా! నీ దగ్గర డబ్బుందేమోనని అడిగాను. మరేం పర్లేదులే! మన రమణమూర్తిని అడిగిచూస్తాను." అంటూ రాజు వెళ్ళిపోయాడు.

అంతవరకు 'షోకేస్' దగ్గర నిల్చున్న రాజమూర్తి ఆషాపు యజమాని దృష్టిలో పడ్డాడు.

"రండిసార్, రండి!" అని అతను ఆహ్వానించేసరికి దర్జాగాలోపలికి వెళ్లాడు రాజమూర్తి.

అప్పుడే వేయబడ్డ ట్యూబ్ లైట్ల కాంతిలో ప్రతిబట్టా వింత అందాన్ని సంతరించుకుంటోంది.

"ఈ షర్టింగ్, చూడండిసార్! న్యూ వెరైటీ! జస్ట్ అన్ పేక్ట్!" రకరకాల షర్టింగ్ పీసుల మీద రాజమూర్తి చూపులు పరుగులు తీస్తున్నయ్.

"ఈ స్ట్రెచ్ ఫేంటింగ్ చూడండి సార్! ఫారన్ ఇంపోర్ట్! నిన్ననే వచ్చింది. మీ కలర్ కి క్వైట్ సూటబుల్ సార్!"

"అవును. ఈ ఫేంటింగ్ చాలా బావుంది. చాలాకాలం మన్నుతుంది కూడా. ఎలాగైనా కొనేయాలి. ఏ షర్టైనా దీనిమీదకి సూటవుతుంది. రాజాలా తిరగొచ్చు. ఇంతకీ దీని రేటెంతో?" స్వగతంలా అనుకున్నా చివరి వాక్యం మాత్రం స్పష్టంగా విన్పించడంతో బట్టల్ని చూపించే అతను అన్నాడు "తీసుకోండి సార్! వోన్లీ హండ్రడ్ ఎండ్ ట్వెంటీ రుపీస్!"

"వాట్! హండ్రడ్ ఎండ్ ట్వెంటీ రుపీస్!!!" ఆశ్చర్యపోయాడు రాజమూర్తి.

రాజమూర్తిని చూపుల్తో ఎగాదిగా చూసిన షాపు యజమాని ఏదో అర్థం చేసుకున్న వాడిలా 'కేష్'లోకి వెళ్ళిపోయాడు. అంతే! అంతవరకు గిరగిర తిరుగుతున్న ఫేన్లు విశ్రాంతి తీసుకున్నాయ్. కొన్ని ట్యూబ్ లైట్లు ముఖాన్ని ముడుచుకున్నాయ్. "క్రిందటి నెల్లో ఇలాంటిదే మా ఫ్రెండొకడు యాభైకి తీసుకున్నాడు—" రాజమూర్తి వేపు అదోలా చూశారు— షాపులో పని వాళ్ళు కూడా. ఇక అక్కడుండలేక షాపులోంచి బయటకొచ్చేశాడు రాజమూర్తి.

నెమ్మదిగా అడుగులో అడుగువేస్తూ నడుస్తున్నాడు.

అతని ఆలోచనలు మాత్రం గిరగిర తిరుగుతున్నయ్.

తాత్కాలికంగా అతని ఆలోచనల్లో సుజాత మహారాణీలా పీఠం వేసుకుని కూర్చుంది. 'సినిమాకు వెళ్దాం డార్లింగ్!' అంది ముసిముసిగా నవ్వుతూ — ఏదోలా చూస్తూ.

"ఏఁవయ్యా! బ్రతకాలని లేదా, ఏఁవిటి? ఇదేఁవైనా నీ ఇల్లనుకున్నావా? నీ ఇష్టమొచ్చినట్లు నడవడానికీను?— పగటికలలు కనడానికీను??" కార్లోంచి ఆ పెద్దమనిషి ఎవర్ని చెప్మా అలా చీవాట్లేస్తున్నాడు? అనుకుంటున్న రాజమూర్తికేసి కోపంగాచూస్తూ ఆ పెద్దమనిషి—

"ప్రతి వెధవకి ఇదో నాటకమైపోయింది, కారుకింద పడితే పదో పరకో రాలుతుందని వెధవ్వేషం!" అంటూ కారుని స్టార్ట్ చేశాడు. తను రోడ్ మధ్యలో కారుకెదురుగా వుండటం—చుట్టూ కొంతమంది చేరటం గమనించిన రాజమూర్తి పక్కకి తప్పుకుని ఫుట్ పాత్ మీదికి నడిచాడు. మళ్ళీ ఆలోచనల్లోకి జారుకున్నాడు. అవును. సుజాతని సినిమాకి తీసుకువెళ్ళాలి, చాలా రోజుల్నుంచి వెళ్ళాలనేవుంది. కానీ వెధవది సమయానికి చేతిలో డబ్బుండి చావడంలేదు. ఈరోజు తప్పకుండా సినిమాకి వెళ్ళాలి. ఎయిర్ కండిషన్డ్ థియేటర్! సెవన్టీ యమ్మెమ్ పిక్చర్! స్పెషల్ సర్కిల్! తను—తన ప్రక్క సుజాత! ఓహ్!.........

సుజాత ఆలోచనల్తో ఉబ్బితబ్బిబ్బవుతూ_మధురోహాల్తో గుండెల్ని స్పందించుకుంటూన్న రాజమూర్తి తన కెదురుగుండా వస్తున్న పాలమనిషికి 'డేష్' ఇచ్చేడు.

"ఓరి గో......" గట్టు తెగిన మహాప్రవాహంలా ఆవిడ నోటినుంచి తిట్ల ప్రవాహం విజృంభించింది. ఆ దెబ్బతో ఆలోచన్లు, గీలోచన్లు కట్టిబెట్టి, ఆవిడకు క్షమాపణ చెప్పకుని తన రూం వేపు నడక సాగించేడు రాజమూర్తి.

మళ్ళీ మామూలే. అతని ఆలోచనల నిండా సుజాత, 'సినిమాకి తీసుకుని వెళ్తే బాగా నేవుంటుంది,' అనుకున్నాడు. 'ఎందుకు బావుండదు? బాగా నేవుంటుంది కానీ ఖర్చంతా నీవే భరించాలోయ్! అధమం ఓ పదైనా అవుతుంది. ఎందుకులెద్దూ?_ఆవిడేమైనా సినిమాకి తీస్కెళ్ళమని నిన్ను అడిగిందా యేఁవిటి? అడిగినప్పుడెప్పుడో చూడొచ్చులెద్దూ!' మరోసారి రాజమూర్తిలోని రాజమూర్తి ఇకిలించాడు. దాంతో బుద్ధిగా రాజమూర్తి తన రూంకి వెళ్ళిపోయాడు. ఒక్క పైసా కూడా ఖర్చవనందుకు తృప్తిగా గాలి పీల్చుకుంటూ ఎంతో అపురూపంగా_ఆప్యాయంగా పర్సుకోసం జేబుల్ని తడిమి చూసుకున్నాడు.

షాక్ తిన్నట్లు ఫీలయ్యాడు.

జేబులు ఖాళీ!

"పర్సేమైంది? వీధిలోకి వెళ్ళేముందు జేబులో నేవుందే! అరెఁ! ఏమైపోయింది!? నూటా ఇరవై రూపాయలు!!!..."

రాజమూర్తి గాభరా పడుతుంటే; ప్రక్కనున్న మంచంపై పడుకున్న రాజు_ "ఏఁవిటి మూర్తీ! అలా కంగారు పడుతున్నావ్?" అడిగాడు.

"అబ్బే! ఏఁవీ లేదు. పెన్ను కనిపించక పోతేను!......"

"ఎక్కడికి పోతుంది?_ఆ పుస్తకాల్లోనే ఎక్కడో వుంటుంది. సరిగ్గా చూడు."

అంతా వెదికి లేదని నిర్ధారణ చేసుకున్న రాజమూర్తి తనలో తను అనుకున్నాడు___'పరీక్ష ఫీజుకోసం ఓ నలభై సర్దరా!' అని రాజు ప్రాధేయపడి అడిగినప్పుడు వాడికి నలభై ఇచ్చినా బావుండేది! ప్చ్! వ్రతం చెడినా ఫలితం మాత్రం ఎవడో మూడోవ్యక్తికి దక్కింది. కాకుల్ని కొట్టి గెద్దలకి వేసినట్లైంది. ఆ ఎనభైకి నా నలభై కడ్డీకూడాను!...

రాజమూర్తి అలా సతమతమవుతూంటే రాజు అన్నాడు "ఒరే మూర్తీ! ఇందాక డబ్బుపోయిందని అనవసరంగా గాభరా పడ్డావ్రా! కాని నిజంగా డబ్బుపోలేదురా! మన గదిలోనే టేబుల్ మీద మరచిపోయావ్రా! రేపు పరీక్షఫీజుకట్టేస్తే మిగతా నలభైతో ఎలాగోలా ఈ నెలంతా సర్దుకోవాలి. నిన్ను అనవసరంగా డబ్బు సర్దమని బాధపెట్టాను కదరా!"

రాజమూర్తి రాజు చెప్పింది విని ఆశ్చర్యపోయాడు.

* * *

కానీ___

రాజుకి___రాజమూర్తే తన జేబులోని ఎనభై రూపాయలు దొంగిలించి, బయటికి వెళ్ళినపుడు టేబుల్ మీద మరచిపోయాడనిగాని___రాజమూర్తి మనీపర్స్ ఎవరో 'మూడోవ్యక్తి' హస్తలాఘవానికి ఆహుతైందనిగాని తెలియదు. ★